సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు..
జిల్లాలో ఒక్కరు కూడా రెగ్యులర్ ఎంఈఓ లేరు. ప్రధానోపాధ్యాయులకే ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వగా, పర్యవేక్షణ కొరవడుతోంది. 8లో



సన్నాలకు ఫుల్ డిమాండ్
సాగు తగ్గడం, అకాల వర్షాలతో పంట కోల్పోవడంతో సన్నరకం ధాన్యానికి ఈ ఏడాది మంచి ధర పలుకుతోంది. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 27° / 16°
జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): డీపీఆర్‌ఓ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన వీడియో కెమెరామెన్, ఫొటోగ్రాఫర్ పోస్టుల భర్తీకి ఈనెల 21లోగా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఆల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 మార్చి 31 వరకు పనిచేయాల్సి ఉంటుందని, నెలకు రూ. 27,130 వేతనం ఇస్తామని పేర్కొన్నారు. వీడియో గ్రాఫర్ పోస్టుకు డిప్లొమా ఇన్ ఫొటోగ్రఫీ, తెలంగాణ లేదా ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ద్వారా సాంకేతిక విద్య, శిక్షణ పొందిన అభ్యర్థులు, యూనివర్సిటీ, తత్సమాన విద్యార్హత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఫొటోగ్రాఫర్‌కు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ప్రముఖ స్టుడియోలో ఐదేళ్ల పనిచేసినట్లు ధ్రువీకరణ పత్రం ఉండాలని వివరించారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు..

కొత్తగూడెంఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ)లో డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్‌లో హయ్యర్, లోయర్ కోర్సులు చదివేందుకు ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత డాక్యుమెంట్లను తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు ఈనెల 29 వరకు పరీక్ష ఫీజును చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుందని, అపరాధ రుసుముతో జనవరి 12 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఫీజు వివరాల కోసం ఏసీజీఈ మాధవరావు (89192 79238)ను సంప్రదించాలని సూచించారు.

20, 29వ తేదీల్లో సదరం క్యాంపులు

చుంచుపల్లి: జిల్లాలోని దివ్యాంగుల కోసం ఈనెల 20, 29 తేదీల్లో సదరం క్యాంపులు ఏర్పాటు చేసినట్లు డీఆర్డీఓ జి.మధుసూదన్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఈ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం స్లాట్ బుకింగ్ అవకాశం అందుబాటులోకి వచ్చిందని, దివ్యాంగులు మీసేవా కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకుని, సరైన ఆధారాలతో క్యాంపులకు హాజరుకావాలని సూచించారు.

రైళ్లను పునరుద్ధరించాలి

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైలే స్టేషన్ నుంచి గతంలో నడిచిన రైళ్లన్నింటినీ పునరుద్ధరించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు రైల్వే స్టేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్తగూడెం రైల్వే స్టేషన్‌ను బొగ్గు రవాణాకు మాత్రమే ఉపయోగిస్తున్నారని, ప్రయాణికుల సౌకర్యాలను గాలికొదిలేశారని ఆరోపించారు. భద్రాచలం వచ్చే యాత్రికులకు కూడా సౌకర్యం లేకుండా పోయిందన్నారు. వారం రోజుల్లోగా కొన్ని రైళ్లను పునరుద్ధరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో అఖిలపక్ష నాయకులు అన్నవరపు సత్యనారాయణ, శ్రీనివాస్, బత్తుల సత్యనారాయణ, కొదమసింహం పాండురంగాచార్యులు, గోపాల్‌రావు, గుండా రమేష్, సతీష్ ఉన్నారు.

నవమికి పూర్తయ్యేనా?

భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో వంతెన పనులు ఇంకా కొలిక్కి రాలేదు. ఇక్కడ శంకుస్థాపన జరిగి వచ్చే ఏప్రిల్‌కు తొమ్మిదేళ్లు. అయినా ఇప్పటికీ పిల్లర్ల నిర్మాణం, అనుసంధానం మాత్రమే పూర్తయ్యాయి. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు రోజుల క్రితం బ్రిడ్జి పనులను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఏప్రిల్ 17న జరిగే శ్రీరామనవమి వేడుకల వరకైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందా అని భక్తులు, స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అధునాతన టెక్నాలజీ, సరైన రవాణా వ్యవస్థ లేని నాటి కాలంలోనే మొదటి బ్రిడ్జి నిర్మాణం ఐదేళ్లలోనే పూర్తయింది. కానీ రెండో బ్రిడ్జి నిర్మాణంలో జాప్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. – భద్రాచలం

నత్తనడకన రెండో బ్రిడ్జి పనులు
- శంకుస్థాపన చేసి వచ్చే ఏప్రిల్‌కు తొమ్మిదేళ్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- మంత్రి ఆదేశాలతోనైనా అధికారులు స్పందిస్తారా..



భద్రాచలం వద్ద అసంపూర్తిగా మిగిలిన రెండో వంతెన పనులు

తుమ్మల ఆదేశాలు పనిచేసేనా..?

2015 ఏప్రిల్ 1న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు నాటి కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరితో కలిసి భద్రాచలం వద్ద గోదావరిపై రెండో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇటీవలి వరకు రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో ఇప్పటివరకూ బీజేపీయే అధికారంలో ఉన్నాయి. అయినా పనులు మాత్రం పూర్తి కాలేదు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా, తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలోని సమస్యలపై పట్టున్న ఆయన గత ఆదివారం బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్రోచ్ రోడ్ నిర్మాణానికి మట్టి దొరకటం లేదని వారు సమాధానం చెప్పడంతో తీవ్రంగా మందలించారు. స్థానికంగా సీతారామ ప్రాజెక్టు పనులు నడుస్తుండగా మట్టిని ఇమ్మడి ముబ్బడిగా స్థానికులు తరలిస్తున్న సమయంలో అధికారులు మట్టి దొరకడం లేదని చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. ఏదేమైనా బ్రిడ్జి ఫుట్‌పాత్, అప్రోచ్ నిర్మాణం, ఇతర పనులు ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

తొమ్మిదేళ్లలో అనేక మలుపులు..

జాతీయ రహదారి 221 పరిధిలోని భద్రాచలం గోదావరిపై మొదటి బ్రిడ్జికి సమాంతరంగా 10 అడుగుల దూరంలో 36 పిల్లర్లతో రెండో బ్రిడ్జి పనులను ప్రారంభించారు. సారపాక వైపున 600 మీటర్ల అప్రోచ్ రోడ్డు, 12 మీటర్ల వెడల్పుతో పాటు ఇరువైపులా నాలుగు అడుగుల ఫుట్‌పాత్ నిర్మించేలా రూపకల్పన చేశారు. మొదట రూ.65 కోట్ల వ్యయంతో రాజ్‌దీప్ అనే నిర్మాణ సంస్థ పనులు ప్రారంభించింది. 2016 డిసెంబర్ నాటికి పూర్తి కావాలని నిర్దేశించారు. అప్పటికి పూర్తి కాకపోవడంతో 2019 వరకు గడువు పొడిగించారు. అప్పటికీ కాకపోవడంతో పలు కారణాలను సాకుగా చూపిన సంస్థ.. మళ్లీ గడువు కోరింది. దీంతో నిర్మాణ సంస్థకు జరిమానా విధించిన ప్రభుత్వం 2021 జూన్ లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అప్పటికి కూడా నిర్మాణం పూర్తి కాకపోవడంతో జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలోనే బ్రిడ్జి పనులు చేపట్టారు. అనంతర కాలంలో 36 పిల్లర్లను పూర్తి చేసి గ్రెడ్డర్లను అనుసంధానం చేసి ఫుట్‌పాత్ పనులు చేస్తున్నారు.

శ్రీరామనవమికి రాకపోకలు సాగేనా..

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో అయినా జాతీయ రహదారుల శాఖ అధికారుల్లో చలనం వచ్చి బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. ఫిబ్రవరి నాటికి కాకున్నా భద్రాచలంలో ఏప్రిల్‌లో జరిగే అతి పెద్ద ఉత్సవం శ్రీరామనవమి నాటికై నా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. రామయ్య కల్యాణానికి రాష్ట్రంతో పాటు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు భద్రాచలం వస్తుంటారు. దీంతో ప్రతీ ఏడాది ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతుంటాయి. ఈలోపే రెండో బ్రిడ్జి అందుబాటులోకి వస్తే బాగుంటుందని భక్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా, దీనిపై జాతీయ రహదారుల శాఖ ఈఈ శైలజను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

స్వామివారి ఎదుట ప్రబంధాలు పఠిస్తున్న వేద పండితులు



పరశురామ దర్శనం.. పరమానంద భరితం

- రామాలయంలో కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు
- నేడు నిజరూపంలో భద్రాద్రి రామయ్య

భద్రాచలం: తన తండ్రి జమదగ్నిని చంపిన వేయి చేతులు గల కార్త వీర్యార్జునుని సంహరించి 21 పర్యాయాలు భూమినంతా గాలించి దుష్టులైన వారిని సంహరించుటకు అవతరించిన పరశురామావతారంలో భద్రాద్రి రామయ్య దర్శనమిచ్చారు. ఈ రూపంలో ఉన్న స్వామివారిని వీక్షించిన భక్తులు పరమానంద భరితులయ్యారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. పగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని పరశురామావతారంలో అలంకరించారు. బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మేళతాళాలు, భక్తుల కోలాటాల నడమ ఊరేగింపుగా మిథిలా స్టేడియం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రత్యేక పూజలు, హారతి సమర్పించిన అనంతరం వైభవంగా తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.



మిథిలా స్టేడియం వేదికపై హారతి సమర్పిస్తున్న అర్చకులు



స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నేటి రామావతార విశిష్టత..

వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారు గురువారం నిజరూపమైన రామావతారంలో దర్శనమివ్వనున్నారు. వ్యక్తిగత సౌఖ్యాల కన్నా ధర్మాచరణయే ఉత్తమమైనదని, అదే శాశ్వతమని భావించాడు శ్రీరాముడు. పరిపూర్ణమైన మానవుడు ఎలా ఉండాలో ఆచరించి చూపించిన ఆదర్శ పురుషుడు, మర్యాద పురుషోత్తముడు. సూర్య గ్రహ బాధలున్న వారు రామావతారాన్ని దర్శించడం వల్ల విముక్తి పొందుతారని పండితులు చెబుతున్నారు.

గిరిజనుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంఅర్బన్ : మారుమూల గిరిజన గ్రామాల్లో నివసించే ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంచార ఆరోగ్య వాహనాల పనితీరు గురించి అడిగి తెలుసున్నారు. ఆదివాసీ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్యం అందించాలని, మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. వైద్యులు విధుల పట్ల అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. గిరిజనుల కోసం మందులు కొనుగోలు చేయడానికి రూ.5 లక్షల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో గిరిజనులకు మాత్రమే ఉపయోగపడేలా మందులు అందుబాటులో ఉంచాలని, ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో గర్భిణులు, ముఖ్యంగా ఆదివాసీ మహిళలు సాధారణ ప్రసవం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇందుకోసం స్త్రీ వైద్య నిపుణురాలికి రూ.50 వేలు ఇన్‌సెంటివ్ అధికంగా ఇచ్చి సేవలు ఉపయోగించుకోవాలని చెప్పారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, ప్రోగ్రాం మేనేజర్ రాములు, ఉద్యానవనాధికారి అశోక్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

రెండింటికీ పొంగులేటి!

- ఖమ్మం, మానుకోట పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియామకం
- సికింద్రాబాద్, హైదరాబాద్‌కు భట్టి, మల్కాజ్‌గిరి స్థానానికి తుమ్మల
- జిల్లా నుంచి ముగ్గురు మంత్రులకు బాధ్యతలు
- లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ ముందస్తు కార్యాచరణ



డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది. ఇటీవల రాష్ట్రంలో విజయం సాధించిన పార్టీ.. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలోని 17 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా మంత్రులు, ముఖ్య నేతలు సమన్వయంతో ముందుకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించింది. ఈ నేపథ్యాన అన్ని స్థానాలకు పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల బాధ్యతను రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అప్పగించింది. అలాగే డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను సికింద్రాబాద్, హైదరాబాద్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జులుగా నియమించారు. సీఎం రేవంత్‌రెడ్డి తర్వాత జిల్లాకు చెందిన భట్టి, పొంగులేటికి రెండేసి పార్లమెంట్ స్థానాల బాధ్యతలు కట్టబెట్టడం విశేషం.

పొంగులేటికి కీలకంగా..

ఖమ్మం పార్లమెంట్ స్థానం ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో విస్తరించి ఉండగా, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో ఇక్కడి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. దీంతో ఈ రెండు స్థానాల ఇన్‌చార్జిగా మంత్రి పొంగులేటి కొనసాగుతారు. అసెంబ్లీ ఎన్నికల్లో పొంగులేటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాకుండా మహబూబాబాద్, వనపర్తి, నల్లగొండ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. ఆయన ప్రచారానికి వెళ్లిన అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే తమ లక్ష్యమని చెప్పగా.. భద్రాచలం మినహా ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్, పొత్తులో భాగంగా కొత్తగూడెంలో సీపీఐ విజయం సాధించాయి. ఈ మేరకు భట్టి, తుమ్మలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన పొంగులేటిని అధిష్టానం ప్రత్యేకంగా గుర్తించినట్లు రెండు పార్లమెంట్ స్థానాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో స్పష్టమవుతోంది. ఈ రెండింటి పరిధిలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, భద్రాచలంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పొత్తుతో కొత్తగూడెం స్థానాన్ని సీపీఐ దక్కించుకోగా.. మిగిలిన 12 స్థానాల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. దీంతో రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో పొంగులేటికి ఉన్న పరిచయాలు, పార్టీ కేడర్, కుటుంబ బంధుత్వం లోక్‌సభ ఎన్నికల్లోనూ అభ్యర్థుల విజయానికి కలిసొస్తుందన్న భావనతో ఆయనకు ఈ బాధ్యతలు ఇచ్చినట్లు పార్టీ నేతల ద్వారా తెలిసింది. కాగా, ఖమ్మం లోక్‌సభ స్థానం పరిధిలో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

రాజధానిలో భట్టి, తుమ్మల

రాజకీయంగా సీనియర్ నాయకులు, మంత్రులైన భట్టి, తుమ్మలకు పార్టీ అధిష్టానం ప్రాధాన్యత ఇచ్చి రాజధానిలోని పార్లమెంట్ స్థానాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. సామాజిక సమీకరణలు, గతంలో పనిచేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని భట్టిని సికింద్రాబాద్, హైదరాబాద్, తుమ్మలను మల్కాజ్‌గిరి ఇన్‌చార్జిగా నియమించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా భట్టి హైదరాబాద్‌లో ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో విజయం దక్కించుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన నేపథ్యాన జోష్‌లో ఉన్న పార్టీ శ్రేణులు అదే ఉత్సాహంతో లోక్‌సభ ఎన్నికలకు సై అంటున్నాయి.

భూ సమస్యలే అధికం

- ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదుదారులు
- కొత్త ప్రభుత్వంలో సత్వర న్యాయం జరుగుతుందనే ఆశ..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికంగా భూ సమస్యలపైనే దరఖాస్తులు వస్తున్నాయి. పోడుపట్టాల పంపిణీ తర్వాత కూడా ఇంకా కొందరు గిరిజనులు తమకు అందలేదంటూ దరఖాస్తులు ఇస్తున్నారు. ఆస్తి తగాదాల విషయంలోనూ భారీగానే అప్లికేషన్లు సమర్పిస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా తమ సమస్యలు పరిష్కారం అవుతాయా అనే ఆశతో పలువురు రావడం కనిపించింది. వీటితో పాటు ఉద్యోగావకాశాలు, వివిధ రకాల పెన్షన్లు, సదరం సర్టిఫికెట్లు ఇప్పించాలని పలువురు వినతిపత్రాలు ఇచ్చారు. అయితే అవకాశం ఉన్నంత మేరకు సత్వరమే సమస్యలు పరిష్కరించేలా అధికారులు కృషి చేస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌ల్లో మండల స్థాయి అధికారులు కూడా అందుబాటులో ఉండడంతో సమస్యలపై వారితో చర్చిస్తున్నారు. సోమవారం నాటి ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్ దరఖాస్తులు స్వీకరించారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

ప్రగతి నివేదికలు అందజేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు అందజేయాలని అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 21న అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఏర్పాటుచేశారని, ఈ నేపథ్యంలో శాఖలవారీగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నివేదికలు అందజేయాలని చెప్పారు. ఇక కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే సమీక్షకు అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ ధ్రువీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయాలన్నారు.

రెండో విడత అక్రిడిటేషన్లు ఇవ్వాలి

జిల్లాలో రెండో విడత అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో పలువురు పాత్రికేయులు అదనపు కలెక్టర్ పి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. మొదటి విడత అక్రిడిటేషన్లు మంజూరు చేసే సమయంలో తాము కేబుల్ చానళ్లలో స్టాఫ్ రిపోర్టర్లుగా, నియోజకవర్గ రిపోర్టర్లుగా విధులు నిర్వహిస్తున్నామని, నాడు సాంకేతిక సమస్యలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయలేకపోయామని పేర్కొన్నారు. రెండో జాబితాలో ఆన్‌లైన్ చేసినా ఇంతవరకూ కార్డులు ఇవ్వలేదని తెలిపారు. దీంతో అదనపు కలెక్టర్ ఆ దరఖాస్తును డీపీఆర్వో శ్రీనివాసరావుకు ఎండార్స్ చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు.

ఇప్పటికి పదిసార్లు దరఖాస్తు ఇచ్చా



టేకులపల్లి మండలం బోడు రెవెన్యూ గ్రామంలోని పాతర్లగడ్డలో 103/5, 145/2 సర్వే నంబర్లలో నాకు 30 ఎకరాల సాగు భూమి నా తండ్రి ద్వారా సంక్రమించింది. దాన్ని ఇతరులు స్వాధీనం చేసుకుని సాగు చేస్తున్నారు. ఈ విషయంలో న్యాయం చేయాలని ప్రజావాణిలో ఇప్పటివరకు పదిసార్లు దరఖాస్తు ఇచ్చినా పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నా భూమి ఇప్పించాలని కోరుతున్నా.
– పొన్నం తులసీరాం, కొత్తగూడెం

25సార్లు ఇచ్చినా చర్యల్లేవ్



లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీ పంచాయతీలో 2021 నుంచి 2023 వరకు రూ 1.59 కోట్ల అవినీతి జరిగిందని ఆర్‌టీఐ ద్వారా తీసుకున్న ఆధారాలతో ఇప్పటివరకు 25 సార్లు ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చాను. అయినా సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ కొత్త ప్రభుత్వంలో అయినా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారనే ఆశతో మళ్లీ వినతిపత్రం అందించా.
– నల్లమల సత్యనారాయణ, శ్రీనగర్ కాలనీ

సింగరేణి ఎన్నికలపై డోలాయమానం

హైకోర్టులో విచారణ ఈనెల 21కి వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై డోలాయమానం కొనసాగుతోంది. ఎన్నికలు మరికొంత కాలం వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శి ఈనెల 12న హైకోర్టులో పిటీషన్ దాఖలు వేశారు. దీనిపై సోమవారం వాదనలు జరగాల్సి ఉండగా, ధర్మాసనం 21వ తేదీకి వాయిదా వేసింది. కాగా, సింగరేణిలో ఈనెల 27న గుర్తింపు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందుకు 9 రోజుల సమయమే ఉండగా యాజమాన్యం, కేంద్ర కార్మిక శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోపక్క వివిధ సంఘాల నాయకులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇంతలోనే పిటీషన్ దాఖలు చేయడం, వాదనలు 21వ తేదీకి వాయిదా పడడంతో ఎన్నికలు జరుగుతాయా, వాయిదా పడతాయా అన్నది తెలియడం లేదు.

మార్చిలో నిర్వహించాలని పిటీషన్

2012, 2017 ఎన్నికల్లో సింగరేణిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. అప్పుడు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉంది. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు జరగాల్సి ఉండగా, కాంగ్రెస్ ఇటీవలే అధికారంలోకి రావడంతో సింగరేణి ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో లోక్‌సభ ఎన్నికల తర్వాతే నిర్వహించేలా రాష్ట్ర ఎనర్జీ సెక్రటరీతో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయించినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వం కొలువుదీరడం, మంత్రిత్వ శాఖల కేటాయింపు, సమీక్షలతో బిజీగా ఉన్నందున ప్రచారానికి సమయం సరిపోదనే భావనతో ఎన్నికలు వాయిదాకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

రెండేళ్లుగా వాయిదా

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు 2017 అక్టోబర్ 5న జరిగాయి. తిరిగి 2021లో ఎన్నికలు జరగాల్సి ఉన్నా కరోనా, తదితర కారణాలతో వాయిదా పడ్డాయి. గడువు ముగిసి రెండేళ్లు కావొస్తున్నా ఎన్నికలు నిర్వహించటం లేదని ఏఐటీయూసీ నాయకులు కోర్టును ఆశ్రయించగా, ఎన్నికలు జరిపించాలని కోర్టు డీవైసీఎల్సీని ఆదేశించింది. దీంతో అక్టోబర్ 28న ఎన్నికలు నిర్వహిస్తామంటూ సెప్టెంబర్ 27న షెడ్యూల్ విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణ, గుర్తులు కేటాయింపు కూడా పూర్తయింది. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న జరగనుండడంతో హైకోర్టును ఆశ్రయించగా సింగరేణి ఎన్నికలు డిసెంబర్ 27న నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ సమయం సమీపించడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నం కాగా, మళ్లీ ప్రభుత్వ ఉన్నతాధికారులు కోర్టులో పిటీషన్ వేయడంతో ఎన్నికలు జరుగుతాయా, మళ్లీ వాయిదా పడతాయా అనే సందిగ్ధత నెలకొంది.

క్లుప్తంగా

ఈ-కేవైసీ కోసం బారులు



నవభారత్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులుదీరిన వినియోగదారులు

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌పీసీఎల్ గ్యాస్ వినియోగదారులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు పొందాలంటే ఈ-కేవైసీ చేసుకోవాలని షరతు విధించారు. దీంతో సోమవారం వినియోగదారులు నవభారత్ వద్ద గల గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద బారులుదీరారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ఇంటికి వచ్చి ఈ-కేవైసీ చేస్తున్నా వినియోగదారులు కార్యాలయానికే తరలిరావడంతో మెయిన్ రోడ్డు వరకు క్యూలైన్ ఏర్పడింది. ఐదేళ్లకోసారి సురక్ష గ్యాస్ పైపు కూడా మార్చాల్సి ఉండగా, రూ.190 చెల్లించి తీసుకుంటున్నారు. గ్యాస్ కార్యాలయానికి వచ్చే వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఎల్టీఆర్ నోటీసులపై ఐటీడీఏ పీఓ ఆరా

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. దీంతో గతంలో పనిచేసిన పీఓలు సుమారు 40 మంది భవన నిర్మాణ యజమానులకు ఎల్టీఆర్ నోటీసులు జారీ చేశారు. వీరిలో అనేక మంది హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. అప్పటి నుంచి సంబంధిత అధికారులు స్టేను వెకేట్ చేయించకపోవడంతో సమస్య సద్దుమణిగింది. కాగా ప్రస్తుతం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ నాలుగు రోజుల క్రితం స్థానిక రెవెన్యూ అధికారులతో ఎల్టీఆర్ నోటీసుల వ్యవహారంపై ఆరా తీశారు. ఏజెన్సీ చట్టం అమలు, హైకోర్టు స్టే తదితర వివరాలు తెలుసుకున్నారు. మరోసారి కొందరికి నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో గత శుక్రవారం నలుగురికి నోటీసులు జారీ చేయగా, భవన నిర్మాణదారుల్లో భయాందోళన నెలకొంది.

కంటి ఆపరేషన్లు ప్రారంభం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 15న కంటికి వచ్చే శుక్లాలకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్న ఇద్దరికి కంటి వైద్యుడు సంతోష్ లేజర్ (ఫ్యాకో) సర్జరీ నిర్వహించారు. అప్పటినుంచి వారు వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. సోమవారం జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు కంటి ఆపరేషన్ జరిగిన తీరును వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఏజెన్సీవాసులు ఎదురు చూస్తున్న కల నెరవేరిందని పేర్కొన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

పంప్‌హౌస్‌కు నిప్పంటించిన మావోయిస్టులు



మావోయిస్టులు దగ్ధం చేసిన పంప్‌హౌస్

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున మావోయిస్టులు ఐరన్‌ఓర్ గనిలోని పంప్‌హౌస్‌కు నిప్పంటించి దగ్ధం చేశారు. బచేలి పోలీస్ స్టేషన్ పరిధి ఐరన్‌ఓర్ గనిలోకి సుమారు 20 మంది మావోయిస్టులు ప్రవేశించి పంప్‌హౌస్‌కు నిప్పంటించారు. అనంతరం వాల్‌పోస్టర్లు వేశారు. ఈ నెల 22న భారత్‌బంద్ పాటించాలని పోస్టర్లలో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న బచేలీ పోలీసులు సోమవారం ఉదయం అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు.

10 మంది మావోయిస్టుల అరెస్ట్

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత నవంబర్ 17న బాన్సీలో రోడ్డు పనులకు వినియోగిస్తున్న 14 వాహనాలకు నిప్పంటించి దగ్ధం చేసిన వారిలో 10 మంది మావోయిస్టులను దంతెవాడ జిల్లా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దంతెవాడ జిల్లాలోని బెచాపాల్, హిర్రేపాల్ అటవీ ప్రాంతాల్లో వాహనాలకు నిప్పుపెట్టిన మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్ 230 బెటాలియన్‌కు చెందిన బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారించగా వాహనాలు దగ్ధం చేసినట్లు అంగీకరించారని, దీంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై కేసు

పాల్వంచ: ఆస్తి విషయంలో దాడి చేసిన వారిపై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. మండలంలోని రంగాపురానికి చెందిన మాలోతు దేవి, ఆమె భర్త మేఘరాజ్‌పై ఆస్తి పంపకాల విషయంలో మామ తారాచంద్, మరికొందరు కర్రలతో దాడి చేశారు. ఘటనపై దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కార్తీక్ తెలిపారు.

ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు..



ఇల్లెందు ఎంఈఓ కార్యాలయం

- జిల్లాలోని 23 మండలాల్లో 10 మందే ఎంఈఓలు
- ఒక్కొక్కరికి రెండు, మూడు మండలాల బాధ్యతలు
- ప్రభుత్వ పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ

ఇల్లెందురూరల్: జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జ్ ఎంఈఓలతో నెట్టుకొస్తోంది. కనీసం ఒక్కరు కూడా రెగ్యులర్ ఎంఈఓ లేరు. ప్రధానోపాధ్యాయులకే ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వగా, పర్యవేక్షణ అధికారులు తమ సహచరులే కావడంతో ఉపాధ్యాయులు విద్యాబోధన కంటే సొంత పనులపైనే మక్కువ చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్య చతికిలపడుతోంది.

ఒక్కొక్కరికి రెండు, మూడు మండలాలు...

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో పది మంది మాత్రమే ఎంఈఓలు విధుల్లో ఉన్నారు. ఒక్కొక్కరికి రెండు, మూడు మండలాల్లో అదనపు బాధ్యతలు అప్పగించారు. గత సెప్టెంబర్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో చాలా మంది ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. టేకులపల్లి మండలం ఇన్‌చార్జి ఎంఈఓ ఖమ్మం జిల్లా తల్లంపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల ఇన్‌చార్జి ఎంఈఓలు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎంలుగా బదిలీపై వెళ్లారు. జూలూరుపాడు ఇన్‌చార్జి ఎంఈఓ ఖమ్మం జిల్లా ముచ్చర్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. దీంతో పక్క జిల్లా నుంచి రాకపోకలు సాగిస్తూ, ఒక వైపు ఇన్‌చార్జి ఎంఈఓలుగా, మరోవైపు పాఠశాల హెచ్‌ఎంలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన మండలాలకు ఇప్పటిదాకా ఎంఈఓలను నియమించలేదు. గుండాల, ఆళ్లపల్లి మండలాల ఇన్‌చార్జి ఎంఈఓను కొత్తగూడెం చాతకొండ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బదిలీ చేశారు. అదనంగా అశ్వారావుపేట ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఉన్నతి, లక్ష్యపై ప్రభావం

పాఠశాలల్లో ఏం జరిగినా ఉన్నతాధికారులకు ఎంఈఓలే నివేదికలు ఇవ్వాల్సి ఉంటుంది. అందరూ ఇన్‌చార్జిలే కావడం, పక్క జిల్లా నుంచి రాకపోకలు సాగించడం, హెచ్‌ఎంగా ఉన్న పాఠశాలపై అధికంగా దృష్టి పెట్టడం వల్ల మండల పాలనను గాలికొదిలేసినట్లయింది. గతంలో జిల్లా వ్యాప్తంగా ఇద్దరు, ముగ్గురు డిప్యూటీ డీఈఓలు ఉండేవారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తూ విద్యాశాఖను అప్రమత్తం చేసేవారు. జిల్లాల పునర్విభజన సమయంలో ఆ పోస్టులు రద్దు చేశారు. గడిచిన ఆరు నెలలుగా డీఈఓ సైతం ఆశించిన మేర పాఠశాలలను తనిఖీ చేయలేదు. ఎంఈఓలు లేకపోవడం, డిప్యూటీ డీఈఓ పోస్టుల రద్దు, అసెంబ్లీ ఎన్నికలు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన తరుణంలో డీఈఓ తనిఖీలు చేయకపోవడం..పాఠశాలల్లో ప్రస్తుతం అమలవుతున్న ఉన్నతి, లక్ష్య వంటి ప్రధాన కార్యక్రమాలపై ప్రభావం చూపుతోంది. పదో తరగతి ఫలితాలపైనా ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో వివాదాలు

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఉపాధ్యాయులు హెచ్‌ఎంలతో దురుసుగా వ్యవహరించడంతోపాటు సహ ఉపాధ్యాయినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. కొందరు హెచ్‌ఎంలు కూడా బాధ్యతాయుతంగా లేకపోవడంతో విద్యార్థుల హాజరు, ప్రగతి తగ్గుతోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇటీవల ఇల్లెందు మండలంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల అదృశ్యం వంటి ఘటనలకు సంబంధించి.. సొంత శాఖ అధికారుల విచారణ కారణంగా అసలు విషయాలు వెలుగుచూడలేదనే ఆరోపణలు లేకపోలేదు. కాగా ఇటీవల అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలి



జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. అర్హత ఉన్న హెచ్‌ఎంలకు ఎంఈఓలుగా పదోన్నతి కల్పించి, అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలి. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలి.

– సాంబ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

అధిక ప్రాధాన్యమివ్వాలి



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు అధిక ప్రాధాన్యమివ్వాలి. అసంపూర్తిగా ఉన్న పాఠశాలల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. రెగ్యులర్ ఎంఈఓలను నియమించి పాఠశాల విద్యను బలోపేతం చేయాలి.

– అభిమన్యు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

‘అత్యంత మేధావి’గా అవ్యక్త



అవార్డుతో అవ్యక్త

కొత్తగూడెంటౌన్: అమెరికాలోని వాషింగ్టన్‌లో ఉన్న సియాటల్ నగరంలో ఈనెల 16న ‘సామాజిక విద్యాపరమైన సమతుల్యత’ అంశంపై జరిగిన ఈవెంట్‌లో కొత్తగూడేనికి చెందిన పదమూడేళ్ల బాలిక అవ్యక్త గెల్లా ప్రతిభ కనబరిచి అత్యంత మేధావి అవార్డుకు ఎంపికైంది. అమెరికాలో ఉంటున్న గెల్లా గణేష్ – రాధిక కుమార్తె అవ్యక్తతో పాటు 13 ఏళ్ల నుండి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగిన 30 మంది ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిస్ టీన్ విభాగంలో అవ్యక్త పలు అంశాలపై తన ప్రసంగంతో ఆకట్టుకోగా అవార్డుకు ఎంపిక చేశారు. ఈమేరకు ఆమె తాతయ్య, అమ్మమ్మ అయిన కొత్తగూడేనికి చెందిన వసుంధర వస్త్ర దుకాణం యజమానులు తాటిపల్లి శంకర్‌బాబు – రాజేశ్వరి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా ఐరన్ పైపుల చోరీ

పట్టించుకోని కేటీపీఎస్ ఉన్నతాధికారులు



ఎస్‌పీఎఫ్ సిబ్బంది పట్టుకున్న ఐరన్ పైపు

పాల్వంచ: కేటీపీఎస్ యాష్ పాండ్‌లో తరచూ ఇనుప పైపుల చోరీలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. అడపదడపా చోరులు పట్టుడుతున్నా పోలీసులు కూడా దర్యాప్తు సక్రమంగా చేయడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 7వ దశ, 1000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5,6 దశల కర్మాగారాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన యాష్ పాండ్(బూడిద చెరువు) పరిధి పెద్దదిగా ఉంటుంది. మండలంలోని పునుకుల, పుల్లాయిగూడెం, సూరారం, పాండురంగాపురం గ్రామాల మధ్యలో ఉంటుంది. చుట్టూ అటవీ ప్రాంతం, పొలాలు ఉండటంతో దొంగలు సులువుగా ఐరన్ పైపులను చోరీ చేసి తరలించుకుపోతున్నారు. యాష్‌పాండ్‌పై ఎస్‌పీఎఫ్ పర్యవేక్షణ లేదు. అయినా విశ్వసనీయంగా అందిన సమాచారంతో కొందరు దొంగలను ఎస్పీఎఫ్ సిబ్బంది పట్టుకుంటున్నారు. అక్కడి సిబ్బంది మాత్రం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పైపులను కట్ చేసి ట్రాక్టర్‌లో తరలించుకుపోయారు. మరో చోట పైపులు కట్ చేస్తుండగా, ఎస్‌పీఎఫ్ సిబ్బంది గమనించి వెళ్లే సరికి పరారయ్యారు. గ్యాస్‌కట్టర్లు, సామగ్రిని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించినా కనీసం పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆదివారం యాష్ పాండ్ నుంచి రూ.50వేల విలువైన పైపును ట్రాలీని ఆటోలో తరలిస్తుండగా ఎస్‌పీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. కేటీపీఎస్ ఏఈ రామారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా తరచూ ఐరన్‌పైపుల చోరీలతో జెన్‌కో సంస్థకు నష్టం వాటిల్లుతోంది.

ప్రత్యేక నిఘాతో పట్టుకుంటున్నాం

బూడిద చెరువు వద్ద పైపులను చోరీ చేసేవారిని నిఘా వర్గాల సమాచారంతో పట్టుకుంటున్నాం. అక్కడ మా విధులు పూర్తి స్థాయిలో లేవు. అయినా చోరీలను అదుపు చేసేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. పెట్రోలింగ్ ఇంకా పెంచుతాం. ఇటీవల జరిగిన చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. అనుమానితుల వివరాలూ తెలిపాం. – అప్పాజీ, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, కేటీపీఎస్ కాంప్లెక్స్

ఆపన్నహస్తం అందించరూ..

రెండు కిడ్నీలు దెబ్బతినడంతో తీవ్ర అనారోగ్యం



డయాలసిస్ చేయించుకుంటున్న బాధితుడు రామకృష్ణ

మణుగూరు రూరల్ : కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది. పినపాక మండలం ఏడూళ్లబయ్యారం ఎస్సీ కాలనీకి చెందిన మేకల రామకృష్ణ–భాను దంపతులకు ఇద్దరు సంతానం. రామకృష్ణ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎనిమిది నెలల క్రితం రామకృష్ణ అనారోగ్యానికి గురవగా, కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించారు. హైబీపీ ఉందని గుర్తించిన వైద్యులు సంబంధిత చికిత్స అందించారు. నెలలు గడిచినా నయం కాలేదు. మళ్లీ వైద్య పరీక్షలు చేయించగా రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు తెలిపారని, చికిత్సకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యం కోసం ఇంకా వెచ్చించే స్తోమత ఆ కుటుంబానికి లేదు. ఇటీవల మణుగూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభం కావడంతో ఏడూళ్లబయ్యారం నుంచి ఇక్కడికి తీసుకొచ్చి డయాలసిస్ చేయిస్తున్నారు. కాగా రామకృష్ణ తండ్రి ఇటీవల మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఇద్దరు చిన్నారులతో రామకృష్ణ భార్య ఆవేదన చెందుతోంది. తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. దాతలు 95021 39435 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఆయుర్వేద విభాగంలో ఖాళీగా ఉన్న 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ పోస్టు 1, ఫార్మసిస్ట్ పోస్టులు 12 ఉన్నాయి. ఈ పోస్టులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈ నెల 14 తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మంగళవారంతో దరఖాస్తు గడువు ముగియనుందని సంబంధిత అధికారులు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



కరీంపాషా(ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సూపర్‌బజార్ కాలనీలో ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం వెలుగుచూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సూపర్‌బజార్ ప్రాంతానికి చెందిన కరీం పాషా(32) ఏడాదికాలంలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి సూపర్‌బజార్ కాలనీలోని సలీం టీ స్టాల్ ఎదుట ఓ పాడుబడ్డ ఇంట్లో ఉన్న బావిపై కూర్చొని మద్యం తాగాడు. ప్రమాదవశాత్తు బావిలో పడిపోయి మృతి చెంది ఉంటాడని స్థానికులు, కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు భద్రాచలం ఎస్‌ఐ మధుప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో బీట్ ఆఫీసర్ మృతి



తిరుపతిరావు (ఫైల్)

దమ్మపేట: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని ఎర్రన్నపేట గ్రామానికి చెందిన సున్నం తిరుపతిరావు(55) మల్కారం గ్రామంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం రాత్రి అకస్మాత్తుగా గుండెలో నొప్పి రాగా, కుటుంబ సభ్యులు సత్తుపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

చంద్రుగొండ : మండలంలోని వెంకటాపురంలో ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. వెంకటాపురం గ్రామానికి చెందిన అమృతపల్లి శివ, లింగమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్‌కుమార్(15) సుజాతనగర్ మండలం వేపలగడ్డలోని గురుకుల విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రవీణ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని మూడు రోజులక్రితం ఉపాధ్యాయులు తండ్రి శివకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ఇంటికి తీసుకొచ్చి ఆస్పత్రిలో పరీక్షలు చేయించారు. డాక్టర్ పరీక్షించి ఎలాంటి అనారోగ్యం లేదని చెప్పినట్లు విద్యార్థి తండ్రి చెబుతున్నాడు. అప్పటి నుంచి అతడు కొంత నీరసంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కాగా ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు.

పందికొక్కులను అడ్డుకునేందుకు విద్యుత్ తీగ

ప్రమాదవశాత్తు తాకిన వృద్ధురాలు మృతి

కారేపల్లి: బస్తాలను కొరుకుతూ ధాన్యం తింటున్న పందికొక్కులను నిర్మూలించేందుకు ఏర్పాటుచేసిన కరెంట్ తీగను ప్రమాదవశాత్తు తాకిన వృద్ధురాలు మృతి చెందింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గుడితండా గ్రామంలో సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గుడితండా గ్రామానికి చెందిన బాణోతు గంసీ(60) – బాణోతు పంతుల్యా దంపతులు చిన్న కుమారుడు రమేష్ వద్ద ఉంటూ వ్యవసాయ చేస్తున్నారు. ఇటీవల కోసిన వరి ధాన్యాన్ని బస్తాల్లో ఇంటికి చేర్చి వరండాలో నిల్వ చేశారు. అయితే, పంది కొక్కులు ఎక్కువగా ఉండి బస్తాలను కొట్టేసి ధాన్యం తింటున్నాయి. దీంతో రాత్రివేళ వడ్ల బస్తాల చుట్టు కరెంట్ తీగ అమర్చి ఉదయం కాగానే స్విచ్ బోర్డు వద్ద ఆఫ్ చేసేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం మరిచిపోయారు. దీనిని గమనించని గంస్వీ ఉదయం చీపురుకట్టతో వరండాలో శుభ్రం చేస్తుండగా స్విచాఫ్ చేశారనుకుని తీగను జరిపేందుకు పట్టుకుంది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. కాసేపటికి కుటుంబ సభ్యులు చూసేసరికి ఆమె మృతి చెంది ఉండడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.

వర్షాలకు తడిసిన పత్తి

జిన్నింగ్ మిల్లుల వ్యాపారులకు రూ. కోటి నష్టం



జిన్నింగ్ మిల్లులో తడిసిన పత్తి

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని నెల్లిపాకలో ఉన్న శ్రీరామ కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లులో నిల్వ ఉంచిన పత్తి తడిసిపోయింది. దీంతో కొనుగోలు చేసి నిల్వ ఉంచిన మిల్లు వ్యాపారులకు రూ. కోటి మేర నష్టం వాటిల్లింది. ఇటీవల రైతుల వద్ద వ్యాపారులు 2,350 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా, 1,500 క్వింటాళ్ల పత్తి తడిసింది. వర్షంతో పత్తి తడిసి భారీగా నష్టపోయినట్లు వ్యాపారులు తెలిపారు.

– అశ్వాపురం

మినీ వ్యాన్ ఢీకొని..

భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

దమ్మపేట: ద్విచక్ర వాహనం, మినీ వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ... మండల పరిధిలోని వడ్లగూడెం గ్రామానికి చెందిన రామళ్ల వెంకటేశ్వర్లు(60) ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న శివాలయంలో పనిచేస్తున్నాడు. సోమవారం తన భార్య అనసూయతో కలిసి ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి వెళ్లి, సాయంత్రం స్వగ్రామానికి తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో ముష్టిబండ గ్రామ శివారు వద్ద అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఎదురుగావచ్చి ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్యను అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించి చికిత్స అందిస్తున్నారు.

చోరీ కేసులో 15 నెలల జైలు

ఖమ్మం లీగల్: చోరీ కేసులో ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన తిరివేధి సురేందర్‌కు 15 నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి వినుకొండ మాధవి సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మంలోని దానవాయిగూడెంకు చెందిన ఓ వ్యక్తి 2022 ఆగస్టు 17న ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లి మరుసటి రోజు వచ్చాడు. అప్పటికే ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో పాటు లోపల బీరువా తాళం పగలగొట్టి రూ.2లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించి ఖానాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వారు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం సురేందర్‌కు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎస్.అనిల్ కుమార్ వాదించగా భద్రునాయక్, నాగేశ్వరరావు, మోహన్‌రావు, వి.రామకృష్ణ సహకరించారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థులకు శిక్షణ



శిక్షణకు హాజరైన వ్యవసాయ విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ ఉన్నత విద్యా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులకు సోమవారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లాక్ సోల్జర్ ఫ్లై పెంపకంపై ప్రాజెక్ట్ అసిస్టెంట్ పరిశోధకురాలు డాక్టర్ వైఎస్ పరమేశ్వరి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కీటకం సేంద్రియ వ్యర్థాలను ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, ప్రొఫెసర్లు గోపాలకృష్ణమూర్తి, టి.పావని, రెడ్డి ప్రియ, రాంప్రసాద్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదల

40 వేల మంది మార్కుల జాబితా వెల్లడించిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు స్టాఫ్‌నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఏడాది క్రితం నోటిఫికేషన్ ఇవ్వగా, రాత పరీక్ష పూర్తయి కొన్ని నెలలైనా ఇప్పటివరకు ఏదో ఒక కారణంతో ఫలితాలు ఆలస్యమయ్యాయి. మంగళవారం మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి ఫలితాలను ప్రకటించారు. 40 వేల మందికిపైగా పరీక్ష రాయగా వారందరి మార్కుల జాబితా విడుదల చేశారు. ప్రత్యేకంగా అర్హత మార్కులు వీటికి లేకపోవడంతో అందరి పేర్లతో జాబితాను విడుదల చేశారు. ఎవరికి వారు అభ్యర్థులు తమకు ఎన్ని మార్కులు వచ్చాయో బోర్డ్ వెబ్‌సైట్లో చూసుకోవచ్చు. అభ్యర్థులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ల అనుభవానికి వెయిటేజీ మార్కులుంటే, వాటిని కలిపే జాబితా తయారు చేశారు. ఈ ఫలితాలపై అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే బుధవారం సాయంత్రం 5.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేస్తారు. ఈ జాబితా ఆధారంగా ఎంపిక చేసిన జోన్‌లోకి వచ్చిన అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం పిలుస్తారు. ఇందులో ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలెక్షన్ లిస్ట్ విడుదల చేస్తారు. అనంతరం జోన్ల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తారు. ఈ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని బోర్డు వెల్లడించింది. కాగా, తొలుత 5,204 స్టాఫ్ నర్స్ ఖాళీల భర్తీకి గత ఏడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేయగా, మూడు రోజుల క్రితమే మరో 1,890 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుబంధ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో మొత్తం 7,094 ఖాళీలను (5,204+ 1,890) భర్తీ చేస్తారు. గతేడాది డిసెంబర్ 30న స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నోటిఫికేషన్‌కు అనుగుణంగా 'కంప్యూటర్ ఆధారిత పరీక్ష' ఈ ఏడాది ఆగస్ట్ 2న జరిగింది. అనంతరం ప్రొవిజనల్ కీ విడుదల చేసి దరఖాస్తుదారుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. సబ్జెక్ట్ నిపుణుల నుంచి వచ్చిన ఇన్‌పుట్‌ల ఆధారంగా 'కీ కమిటీ' తుది కీని ఖరారు చేసింది. ప్రిలిమినరీ కీకి, ఫైనల్ కీకి మధ్య ఎలాంటి తేడా లేదు. దీంతో ప్రిలిమినరీ కీని తుది కీగా పరిగణించారు.

సమస్యలు పరిష్కరించండి

సాక్షి, హైదరాబాద్: కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై.గోపీరెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం సోమవారం డీజీపీ రవి గుప్తాను కలిసి వినతిపత్రం అందించారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులు పరిశీలించొద్దు!

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం చివరలో ప్రారంభించిన గృహలక్ష్మి పథకం కోసం సేకరించిన 15 లక్షల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. వాటిని పూర్తిగా పక్కన పెట్టి కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని భావిస్తోంది.

ప్రభుత్వం కీలక నిర్ణయం?

- గత ప్రభుత్వం చివరలో 15 లక్షల దరఖాస్తుల సేకరణ
- కానీ వాటి స్థానంలో కొత్తగా మళ్లీ దరఖాస్తులు సేకరించాలని ప్రభుత్వ నిర్ణయం
- గ్రామసభల ద్వారా జనం నుంచి దరఖాస్తులు సేకరించేలా ఏర్పాట్లు

మంజూరు చేసే వేళ ముంచుకొచ్చిన ఎన్నికలు

గత ప్రభుత్వం తొలుత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. భారీ యూనిట్ కాస్ట్‌తో, దేశంలో ఎక్కడా లేనట్టుగా ఉచితంగా రెండు పడక గదులతో కూడిన ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. కానీ వాటి యూనిట్ కాస్ట్ సరిపోవటం లేదంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటం, సాంకేతికంగా కొన్ని లోపాలు చూపి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం నిధులు నిలిపేయటం, కొన్ని అంతర్గత లోపాలు.. వెరసి ఆ పథకం అంత వేగంగా ముందుకు సాగలేదు. దీంతో ఏడాది క్రితం.. దాని స్థానంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. సొంత జాగా ఉండి ఇల్లు లేని పేదలకు రూ.3 లక్షలను అందించి వారే ఇళ్లను నిర్మించుకునేలా దీన్ని రూపొందించారు. ఇంచుమించు ఇందిరమ్మ పథకం తరహాలోనే డిజైన్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుని దరఖాస్తులు ఆహ్వానించింది. 15 లక్షల దరఖాస్తులు వచ్చి పడ్డాయి. వాటిల్లో 12 లక్షలు అర్హమైనవిగా గుర్తించారు. వాటిల్లో నుంచి 4 లక్షల దరఖాస్తులు ఎంపిక చేసే వేళ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. చివరి తేదీ రాత్రి వరకు దాదాపు2 లక్షల దరఖాస్తులకు సంబంధించి జాబితాను సిద్ధం చేశారు. వారికి నిధులు ఇచ్చేందుకు వీలుగా ఎన్నికల సంఘం నుంచి అనుమతి కూడా వచ్చింది. కానీ,



అప్పటికే ప్రచారం తారస్థాయికి చేరుకోవటంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ దరఖాస్తులను రిజెక్టు చేస్తుందేమోనన్న భయంతో కొందరు దరఖాస్తుదారులు కూడా అధికారులపై ఒత్తిడి చేయకుండా ఎన్నికలయ్యే వరకు వేచిచూసే ధోరణి అవలంబించాలని నిర్ణయించారు. వారు అనుకున్నట్టే ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల కోసం తమ దరఖాస్తులను పరిశీలిస్తుందని వారు ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ, వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ఆ దరఖాస్తులను పరిశీలించవద్దని ప్రభుత్వం నిర్ణయించింది.

గ్రామ సభల్లో కొత్త దరఖాస్తులు..

గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించేవారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిని అవలంబించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాత ప్రభుత్వం సేకరించిన దరఖాస్తులను పక్కన పెట్టి కొత్తగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు కూడా ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలిసింది. ఇటీవల హైకోర్టులో గిరిజనప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ అంశంపై ఓ కేసు విచారణకు వచ్చింది. నిబంధనల ప్రకారం గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారా జరగాల్సి ఉంటుంది. గిరిజనులకు దక్కాల్సిన లబ్ధి గిరిజనేతరులు తన్నుకుపోతున్నారన్న ఉద్దేశంతో వారికి రక్షణగా ఈ నిబంధన ఏర్పాటు చేశారు. గృహలక్ష్మి పథకంలో దరఖాస్తుల స్వీకరణలో ఈ నిబంధనల పాటించలేదన్నదని ఫిర్యాదు. నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తుల స్వీకరణ జరిగిందన్న వాదనను ఇప్పుడు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టు సమాచారం. సరిగ్గా ఎన్నికల వేళ దరఖాస్తుల పరిశీలన జరిగిన నేపథ్యంలో మొత్తంగా ఆ దరఖాస్తులను పక్కనపెట్టనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

పేదలకు ఆరోగ్యమస్తు

- ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంపు: ఏపీ సీఎం జగన్
- విస్తరించిన ప్రయోజనాలతో ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీ

సాక్షి, అమరావతి: వైద్యం కోసం పేదలు ఏ ఒక్కరూ అప్పుల పాలు కాకూడదనే తాపత్రయంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేశామని, ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వమని, గతంలో ఎన్నడూ చూడని విధంగా ప్రభుత్వ వైద్య రంగం స్వరూపాన్ని మార్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స వ్యయం పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులంటే సిబ్బంది ఉండరనే దుస్థితిని మన ప్రభుత్వం పూర్తిగా మార్చేసిందన్నారు. ఒక్క వైద్య ఆరోగ్య శాఖలోనే 53,126 మంది డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ లాంటి వైద్య సిబ్బందిని నియమించి మానవ వనరుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61 శాతం ఉంటే మన రాష్ట్రంలో కేవలం 3.96 శాతం మాత్రమే ఉందని, ఈ కొరతను కూడా అధిగమించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇక జాతీయ స్థాయిలో నర్సుల కొరత 27 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా అని


స్మార్ట్ కార్డులను అందుకున్న లబ్ధిదారులతో సీఎం

తెలిపారు. జాతీయ స్థాయిలో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత 33 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా స్థాయికి తెచ్చామని, నూటికి నూరు శాతం పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందడానికి ఏం చేయాలి? ఎవరిని అడగాలి? ఎక్కడికి వెళ్లాలి? చికిత్స వ్యయం ఎంతవరకు వర్తిస్తుంది? తదితర సందేహాలను సంపూర్ణంగా నివృత్తి చేస్తూ సరికొత్త ఫీచర్లతో రూపొందించిన ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను లబ్ధిదారులకు అందజేసి విస్తృత అవగాహన కల్పించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం జగన్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు, స్మార్ట్ కార్డుల పంపిణీ, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాలను సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు.



ఎరుపెక్కిన జగిత్యాల

భూమి కోసం భారీగా తరలివచ్చిన మహిళలు

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రం సోమవారం మహిళలతో కిక్కిరిసింది. జిల్లా కేంద్రం శివారు నర్సింగాపూర్, టీఆర్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల్లో పేదలకు పట్టాలు ఇప్పిస్తామని కొంతకాలంగా సీపీఎం నాయకులు ప్రచారం చేశారు. వివిధ జిల్లాల నుంచి మహిళలను తీసుకొచ్చి భూపోరాటం పేరిట గుడిసెలు వేయించారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని, జగిత్యాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆ పార్టీ నాయకులు సూచించడంతో జిల్లాతోపాటు, పొరుగుజిల్లాల నుంచి మహిళలు భారీగా తరలివచ్చారు. చంటిపిల్లలతో తల్లులు, గర్భిణులు, వృద్ధులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. దీంతో జగిత్యాల మొత్తం ఎరుపుమయంగా మారింది. వచ్చిన వారిలో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, వరంగల్, సిద్దిపేట తదితర జిల్లాల వారు కూడా ఉండటం గమనార్హం. దీనిపై మహిళలను ఆరా తీయగా, సీపీఎం నాయకుల ప్రచారం మేరకు జగిత్యాలకు వచ్చామని, దరఖాస్తు చేసుకుంటే కొందరు నాయకులు రూ.200 తీసుకున్నారని, అలాగే నర్సింగాపూర్, టీఆర్‌నగర్‌లో నివాసమున్నవారు రూ.5 వేలు చెల్లించాలని నిబంధన పెట్టారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కావడంతో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చినట్లు తెల్సింది. అయితే ఇళ్లు ఇప్పిస్తామంటూ నేతలు మహిళలకు హామీ ఇచ్చి పంపించినట్లు తెలిసింది.

సీబీఐ ఎస్పీ, వైఎస్ వివేకా కుమార్తె, అల్లుడిపై కేసు నమోదు

- అప్పట్లో పులివెందుల కోర్టులో ప్రైవేట్ కంప్లయింట్ చేసిన వివేకా పీఏ కృష్ణారెడ్డి
- కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎస్పీ రాంసింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిలపై కేసు నమోదు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసుకు సంబంధించి పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎస్పీ రాంసింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిలపై వైఎస్సార్ జిల్లా పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకా హత్యకేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో సీబీఐ అదనపు ఎస్పీ రాంసింగ్ (తరువాత ఎస్పీ అయ్యారు) నేతృత్వంలో దర్యాప్తు కొనసాగిన విషయం విదితమే. రాంసింగ్ ఏకపక్షంగా, కేవలం కేసుతో సంబంధం లేని వ్యక్తులను టార్గెట్ చేసి దర్యాప్తు చేశారని విమర్శలు ఎదుర్కొన్నారు. అందులో భాగంగా అప్పట్లో వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డిని కూడా రాంసింగ్, వైఎస్ వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి పలుమార్లు తమకు అనుకూలంగా వ్యవహరించాలని బెదిరించారు. హత్యకేసు దర్యాప్తులో భాగంగా పీఏ కృష్ణారెడ్డిని పలుమార్లు రాంసింగ్ విచారణకు పిలిపించుకుని కేసులో తాము చెప్పినట్లు వినాలని, తాము చెప్పినట్లుగా కోర్టులో మేజిస్ట్రేట్ ముందర సెక్షన్ 164 కింద వాంగ్మూలం ఇవ్వాలని, కేసుతో సంబంధం కొంతమంది వ్యక్తుల పేర్లు చెప్పాలని బెదిరించారు. దీనికి అంగీకరించని కృష్ణారెడ్డిపై ఆయన కుటుంబసభ్యుల ముందే పలుమార్లు రాంసింగ్ థర్డ్ డిగ్రీ ఉపయోగించి దారుణంగా కొట్టారు. అలాగే వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి కూడా కృష్ణారెడ్డిని తమ వద్దకు పిలిపించుకుని సీబీఐ వారు చెప్పినట్లుగా వినాలని, లేకపోతే ఈ కేసులో ఇరికిస్తారని, సీబీఐ వాళ్లు చెప్పినట్లుగా వినడం వల్లనే వాచ్‌మన్ రంగన్న, డ్రైవర్ దస్తగిరిలను కేసు నుంచి కాపాడటం జరిగిందని పలుమార్లు బెదిరించారు. దీనిపై అప్పట్లో సాక్ష్యం చెప్పడానికి అంగీకరించని పీఏ కృష్ణారెడ్డి 2021 డిసెంబర్ 28వ తేదీన పులివెందుల కోర్టుకు వెళ్లి ప్రైవేట్ కంప్లయింట్ చేశారు. దీన్ని పరిశీలించిన పులివెందుల కోర్టు రాంసింగ్, సునీత, రాజశేఖరరెడ్డిలపై కేసు నమోదు చేసి విచారించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆ ముగ్గురిపై పులివెందుల పోలీసులు ఐపీసీ సెక్షన్లు 352, 323, 330, 342, 348, 506, 194/ఏ, 166ఏ(బి), 109 కింద కేసు నమోదు చేశారు. దీనిపై సోమవారం వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వయిజర్ ఓబుళరెడ్డి పులివెందులలో మీడియాతో మాట్లాడుతూ పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, విచారణలో మిగిలిన విషయాలు తెలుస్తాయని చెప్పారు.

జిల్లా వార్తలు


కార్మికుల కష్టార్జితమంటే లెక్క లేదా?


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించిన లాభాలను కార్పొరేట్ సంస్థలకు అప్పుగా ఇవ్వడం గర్హనీయమని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(జీఎల్‌బీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త గనులు, కొత్త ఉద్యోగాల పేరిట రూ.కోట్ల పెట్టుబడితో నైనీ కోల్ బ్లాక్ ఏర్పాటుచేసినా సింగరేణి కార్మికులకు న్యాయం జరగలేదని చెప్పారు. సింగరేణిలో నూతన గనులు రావాలన్నా, కార్మికుల సంఖ్య పెరగాలన్నా ఈనెల 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో మూడు విప్లవ కార్మిక సంఘాలు బలపరుస్తున్న జీఎల్‌బీకేఎస్‌ను గెలిపించాలని కోరారు. సింగరేణి పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకమవుతున్న పరిస్థితుల్లో కార్మికులు ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి వైద్యశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన యాజమాన్యం కార్పొరేట్ వైద్యం పేరుతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు రూ.కోట్ల నిధులు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, జె.సీతారామయ్య, ఎల్.విశ్వనాథం, గౌని నాగేశ్వరరావు, ఎస్.సంజీవ్, మోత్కూరి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై భారత్ యాత్ర..

సత్తుపల్లికి చేరిన యూపీ యువకుడు


సైకిల్‌పై శివంవర్మ

సత్తుపల్లి: యువత పెడదోవ పట్టకుండా, సన్మార్గంలో వెళ్లాలని ఆకాంక్షిస్తూ సైకిల్‌పై భారత్ యాత్ర చేపట్టిన ఉత్తరప్రదేశ్‌లోని మధురకు చెందిన శివంవర్మ సోమవారం సత్తుపల్లికి చేరారు. ఈ యాత్ర 240 రోజులుగా సాగుతోందని ఆయన తెలిపారు. సైకిల్‌కు సోలార్ ప్యానల్ అమర్చి సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుంటూ ఆలయాల్లో సేదతీరుతూ యాత్ర సాగిస్తున్నానని చెప్పారు. మద్యపానం, ధూమపానానికి యువత దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని ఈ యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

సన్నాలకు ఫుల్ డిమాండ్

- రికార్డుస్థాయిలో ధాన్యం ధరలు
- రకం ఆధారంగా క్వింటాకు రూ.2,500 నుంచి రూ.3,300
- కల్లాలవద్దకే పచ్చి ధాన్యం కొంటున్న వ్యాపారులు
- వానలు లేక తగ్గిన సాగుతో సన్నరకాలకు గిరాకీ


ధాన్యం రాశిని శుభ్రం చేస్తున్న మహిళ

ఖమ్మంవ్యవసాయం: సన్న ధాన్యానికి ఎన్నడూ లేని విధంగా డిమాండ్ పెరిగింది. ఈ ధాన్యానికి డిమాండ్‌సాధారణమే అయినా ఈసారి మంచి ధర పలుకుతోంది. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం గ్రేడ్ 'ఏ' ధాన్యం క్వింటాకు రూ.2,203, సాధారణ(కామన్) రకానికి రూ.2,183గా మద్దతు ధర ప్రకటించింది. కానీ మద్దతు ధర కన్నా ఎక్కువగా వ్యాపారులు చెల్లిస్తుండడం విశేషం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాధారణ రకాల కన్నా గ్రేడ్ 'ఏ' రకం వరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో ఖమ్మం జిల్లాలో 2.78 లక్షల ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ మొత్తంలో సన్న రకాలు 90 శాతం ఉంటాయని అంచనా. ఇతర పంటలతో పోలిస్తే ఈసీరి వరి దిగుబడులు ఆశాజనకంగా ఉండి ఎకరాకు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. మిచాంగ్ తుపాను ప్రభావంతో కొంత నష్టం జరగగా.. అంతకు ముందే పలువురు రైతులు కోత పూర్తిచేశారు. మిగతా వారిని కోత దశలో ఉండగా.. మంచి ధర పలుకుతుండడంతో రైతులకు ప్రయోజనకరంగా ఉంది.

పచ్చి ధాన్యమైనా సరే..

యంత్రాలతో పైరు కోస్తున్న సమయంలోనే వ్యాపారులు రైతులతో కొనుగోలుకు ఒప్పందం చేసుకుంటున్నారు. సాధారణంగా పంట కోసి ఆరబెట్టాక తేమ 17 శాతం ఉన్నప్పుడే ధాన్యం కొనుగోలు చేస్తారు. ఈ ఏడాది మాత్రం తేమ శాతం, ఆరబెట్టడంతో పని లేకుండా పచ్చిగాఉన్న ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కొన్నిచోట్ల కోతలు పూర్తికాకముందే వ్యాపారులు ధరలు నిర్ణయించి రైతులకు అడ్వాన్స్ ఇచ్చి వెళ్తుండడం విశేషం. దీంతో రైతులకు రవాణా ఇబ్బందులు కూడా తప్పుతున్నాయి.

కొనుగోలు కేంద్రాల వెలవెల

ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ ఈ ఏడాది ప్రైవేట్ మార్కెట్‌లో ధాన్యానికి మంచి ధర పలుకుతుండటంతో రైతులు అటే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్నాయి. సాధారణ రకాలు సాగు చేసిన రైతులు మాత్రం ఆయా కేంద్రాల్లో పంట విక్రయిస్తున్నారు.


సాగు లేకపోవడంతోనే..

ఈ ఏడాది వర్షాలు అనుకూలించక అనేక ప్రాంతాల్లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీంతో సన్న ధాన్యం రకాలకు డిమాండ్ పెరిగింది. వివిధ ప్రాంతాల్లోని మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ మిల్లర్లు సన్న రకాల ధాన్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. ఇటీవల వచ్చిన మిచాంగ్ తుపానుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరి దెబ్బతినగా... అక్కడి వ్యాపారులు కూడా ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు సమాచారం.

రకాల ఆధారంగా డిమాండ్

ఈ ఏడాది బీపీటీ–5204(సాంబ మసూరి) ధాన్యం క్వింటాకు రూ.2,500 నుంచి రూ.2,600 వరకు చెల్లిస్తున్నారు. హెచ్‌ఎంటీ రకమైతే రూ.2,700 నుంచి రూ.2,800 వరకు, చింట్లు రూ.3,300కు, ఆర్‌ఎన్‌ఆర్–15048, మార్టేరు–1224 రకాలను రూ.2,600 నుంచి రూ.2,800 వరకు కొనుగోలు చేస్తున్నారు. అంటే ప్రభుత్వ మద్దతు ధరకంటే రూ.300ల నుంచి రూ.1,100 వరకు అదనంగా వ్యాపారులు చెల్లిస్తున్నారు. అంతేకాక తూకంలోనూ క్వింటాకు మరో రూ.200 నుంచి రూ.300 వరకు కలిసి వస్తుందని రైతులు చెబుతున్నారు.


క్వింటా రూ.2,700కు విక్రయించా..



ఆరెకరాల్లో హెచ్‌ఎంటీ అంకూర్ పద్మ రకం సాగుచేశా. పైరుపై ఉన్నప్పుడే వ్యాపారులు ధర మాట్లాడారు. క్వింటా రూ.2,700 చొప్పున పంట ఆరబెట్టకుండానే తీసుకువెళ్లారు. సాంబ మసూరి రూ.2,500 చొప్పున విక్రయించగా.. మునపెన్నడూ లేని విధంగా ధర పలికింది.

– చంద పుల్లారెడ్డి, ఈశ్వరమాదారం, కూసుమంచి మండలం

పచ్చి ధాన్యమే కొనుగోలు చేశారు..



మునుపున్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు కోసం వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఈ ఏడాది దిగుబడులు బాగానే ఉన్నాయి. నేను హెచ్‌ఎంటీ, సాంబమసూరి సాగు చేశా. హెచ్‌ఎంటీ క్వింటా రూ.2,700లకు, సాంబమసూరి రూ.2,500 చొప్పున పచ్చి ధాన్యమే తీసుకెళ్లారు.

– పెద్దబోయిన మల్లేశ్వరరావు, పుల్లయ్యబంజర, కల్లూరు మండలం

విద్యుత్ శాఖ క్రీడాపోటీలు ప్రారంభం

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఇంటర్ సర్కిల్ విద్యుత్ శాఖ ఉద్యోగుల క్రీడాపోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కబడ్డీ, లాన్ టెన్నిస్ పోటీలు జరగగా అధికారులు బి.శ్రీనివాస్, ఏ.సురేందర్ ప్రారంభించి మాట్లాడారు. నిత్యం పనిఒత్తిడి ఎదుర్కొనే ఉద్యోగుల ఉపశమనం కోసం ఈ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుండగా, ఖమ్మంకు కబడ్డీ, లాన్ టెన్నిస్ పోటీలను కేటాయించారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఉద్యోగులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, కార్యదర్శి బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో మూడేళ్లుగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, కొత్త ప్రభుత్వమైన వెంటనే చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో జరుగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలపై ఆధారపడి చదువుతున్న పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా చూడాలన్నారు. వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సంబంధించి డైట్ బిల్లులు విడుదల కాక ఇబ్బంది పడుతున్నారని, వసతిగృహాల్లో మెనూ కూడా అమలుకావడం


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

లేదని తెలిపారు. మెస్ చార్జీలను పెంచి పెండింగ్ బిల్లులను విడుదల చేయడమే కాక గురుకులాలకు సొంత భవనాలు సమకూర్చాలని నాగరాజు కోరారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి, నాయకులు ఫర్వీస్, రాజు, బి వీరభద్రం, శ్రీకాంత్‌వర్మ, అశోక్‌రెడ్డి, సాయికుమార్, ప్రశాంత్, భరత్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పీ

భద్రాచలంఅర్బన్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా భద్రాచలంలో ఈనెల 22, 23వ తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లను సోమవారం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. గోదావరి ఘాట్ వద్ద ఏర్పాట్లపై ఆరా తీసిన ఆయన నది లోతుల్లోకి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ రమాదేవితో ఏర్పాట్లపై ఆయన చర్చించారు. ఆలయ ఈఈ రవీందర్, భద్రాచలం టౌన్ సీఐ నాగరాజురెడ్డి, ఎస్సై పీవీఎస్.రావు ఉన్నారు.


ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఈఓ రమాదేవి

పర్ణశాలలో పరిశీలన

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాలలో జరిగే ముక్కోటి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనం జరిగే ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. ఆతర్వాత వైకుంఠ దర్శనం విషయంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటుచేయాలని సూచించిన ఆయన పార్కింగ్ ఏర్పాట్లపై సీఐ దోమల రమేష్‌కు సూచనలు చేశారు. ఏఈఓలు శ్రావణ్‌కుమార్, అనిల్ కుమార్, పర్ణశాల గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

భద్రాచలం: చలిగాలులు పెరుగుతున్నందున గిరిజన హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ రాత్రి చలి ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లు అందజేలని, ఉపాధ్యాయులు వారి ఆరోగ్యంపై పర్యవేక్షించాలని సూచించారు. కాగా, గిరిజనులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హతల మేరకు పథకాలు చేరేలా పర్యవేక్షించాలని


గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ

తెలిపారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, అధికారులు సురేష్‌బాబు, భాస్కరన్, ఆర్.శ్రీనివాస్, మునీర్‌పాషా, అశోక్‌కుమార్, ఆదినారాయణ, నరేందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.